# రైతుల కంట కన్నీరు



జాలిపూడిలో నీట మునిగిన చేలో నారు చూపుతున్న రైతులు



నీటిలో కుళ్లుతున్న వరి దుబ్బులు

- రెండు వేల ఎకరాల్లో పంటచేల మునక
- కుళ్లిపోతున్న వరి దుబ్బులు
- ఎకరానికి రూ.16 వేల పెట్టుబడి వృథా

**ఏలూరు రూరల్** : ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో పంటచేలు నీట మునిగాయి. ఏడు రోజులుగా ముంపులోనే ఉండడంతో వరి దుబ్బులు కుళ్లిపోతున్నాయి. కొల్లేరులో వరద నీరు సకాలంలో కిందకు పారకపోవడంతో జాలిపూడి, మాదేపల్లి, కోటేశ్వరదుర్గాపురం, చాటపర్రు, బాబూఖాన్‌గూడెం, మాదవాపురం పరిసరాల్లో సుమారు రెండు వేల ఎకరాలు, మల్కాపురంలో తాచుపాము శిల పరిసరాల్లో మరో 50 ఎకరాలు నీట మునిగాయి.

**ఎకరానికి రూ.16 వేలు నష్టం**

ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ఆదిలోనే నష్టం వాటిల్లింది. నెలరోజుల క్రితం ఎకరం దుక్కిదున్నేందుకు రూ.4 వేలు, ఊడ్పుకు రూ.5 వేలు, బాగుజేతకు రూ.2 వేలు, ఎరువులకు రూ.3200, పురుగుమందు పిచికారీకి మరో రూ.1500 చొప్పున ఎకరానికి కనీసం రూ.16 వేలు ఖర్చు చేశామని రైతులు చెబుతున్నారు. ఈ నష్టం నుంచి ఎలా గట్టెక్కగలమని వాపోతున్నారు.

**చెరువుల గట్లు ప్రక్షాళన చేయాలి**

గ్రామ శివారు ప్రాంతాల్లో వెలసిన చేపల చెరువుల గట్లు కారణంగా పంట చేలు నీట మునిగాయి. నీరు కిందకు పారకపోవడంతో ఏడు రోజుల పాటు చేలల్లో వరద నిలిచిపోయింది. ఏలూరు రూరల్ మండలంలో 6,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు చేలను వరదనీరు ముంచింది. మరో రెండురోజులు ఇదే పరిస్థితి కొనసాగితే వరి నాట్లు పూర్తిగా కుళ్లిపోతున్నాయి. చెరువుల వద్ద మురుగునీరు పారుదలకు అడ్డంగా ఉన్న గట్లను తూతూ మంత్రంగా కొట్టేసినా ఫలితం లేదని రైతులు చెబుతున్నారు. చేపల చెరువుల గట్లు పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

### నష్టమే మిగుల్చుతుంది



మా గ్రామంలో 50 ఎకరాలు నీట మునిగాయి. రైతు ఇప్పటికే ఎకరానికి రూ.20 వేలు ఖర్చు చేశాం. నారు బతికితే, పురుగు మందులు, పిచికారీ, యూరియా కోసం మరో 13 నుంచి 15 వేలు అదనంగా ఖర్చు చేయాలి. ఆఖరికి ఎకరానికి రూ.45 వేలు పెట్టుబడి అవుతుంది. పంట సవ్యంగా చేతికి అందితే రైతు ఒడ్డుకు చేరుతాడు. లేదంటే అప్పులు పాలు కావడం తథ్యం.

– తూతా నిరంజన్, మల్కాపురం

## లంకగ్రామాల ప్రజలను ఆదుకోవాలి



మాదవాపురం వద్ద కొల్లేరు వరద ఉధృతిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

**ఏలూరు రూరల్** : ముంపుబారిన పడిన కొల్లేరు ప్రజలను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జిల్లా కార్యవర్గ సభ్యుడు డీఎన్‌వీడీ ప్రసాద్, పి.కిషోర్, కె.శ్రీనివాస్, పీవీ రామకృష్ణతో పాటు ప్రసాద్, పి.కిషోర్ తదితరులతో కలిసి కొల్లేరు గ్రామం మాదవాపురాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వర్షాలు, వరద తాకిడికి కొల్లేరు గ్రామాల ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరు నడిబొడ్డులో చిక్కుకుపోయిన ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ముంపు బారిన పడిన లంకగ్రామాల ప్రజలకు తాగునీరు, నిత్యావసర సరుకులు, మందులు ప్రభుత్వమే ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. రోడ్లు మునిగిపోవడం వల్ల ప్రజలతో పాటు ఆక్వా రైతులు సైతం ప్రమాదకర స్థితిలో వరదలో పయనిస్తున్నారని అన్నారు. సులువుగా రాకపోకలు సాగించేందుకు బోట్లు ఏర్పాటుచేయాలన్నారు.

## చేలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పోణంగి ప్రాంతంలో చేలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

**ఏలూరు రూరల్** : సోమవారం ఏలూరు మండల గ్రామాల్లో ముంపుబారిన పడిన పంటచేలను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఏలూరు డాట్ సెంటర్ నుంచి శాస్త్రవేత్త ఫణికుమార్, నాగేంద్రబాబుతో పాటు మార్టేరు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి టి.సునీత, రోజా, భువనేశ్వరి, రమణరావు, మండల వ్యవసాయ అధికారిణి జీవనసంధ్య తదితరులు పోణంగి, జాలిపూడిలో రైతులను కలిశారు. జాలిపూడిలో అడుగు లోతున మునిగిన చేల్లో నారు తీసి పరిశీలించారు. వరదనీరు తగ్గుముఖం పట్టిన తర్వాత తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం పోణంగిలో రైతులతో మాట్లాడారు. శాస్త్రవేత్తల వెంట సచివాలయ వ్యవసాయ సహాయకులు కోనంగి రామ్‌తేజ, సూర్యప్రకాశ్ ఉన్నారు.

## క్లుప్తంగా

### వరద బాధితులకు వైద్య సేవలు



విజయవాడలో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో పాల్గొన్న పెరికె వరప్రసాదరావు

**ఏలూరు (టూటౌన్):** స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకోవాలని సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు కోరారు. సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవాడ వరద బాధితులకు సోమవారం నిర్వహించారు. స్థానిక నైజాం గేట్ సెంటర్, వింజపేట, శ్రీ విద్యాంజలి స్కూల్‌లో ఈ క్యాంపు నిర్వహించారు. అన్నిరకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, సుమారు 300 మందికి మందులు పంపిణీ చేశారు. క్యాంపులో వైద్యులు అలేఖ్య, చంద్రిక, వింజపేట మహిళా నాయకురాలు ఎండీ సల్మా సుల్తాన్, మెడికల్ స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

### బలమైన ఆహారం తీసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శశాంక్

**ఏలూరు (టూటౌన్):** గర్భిణులు, బాలింతలు బలమైన ఆహారం తీకసుకోవాలని డాక్టర్ శశాంక్ అన్నారు. స్థానిక 39వ డివిజన్ పరిధిలోని కొత్తపేట యూహెచ్‌సీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం మౌనిక ప్రియాంక అధ్యక్షతన సోమవారం పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శశాంక్ మాట్లాడుతూ గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వగలరని తెలిపారు. రక్తహీనత బారిన పడకుండా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు హెచ్‌బీ టెస్టులు నిర్వహించారు. హెచ్‌వీ సీహెచ్ మార్తమ్మ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

### నిత్యావసర సరుకుల పంపిణీ

**ఏలూరు రూరల్** : సోమవారం ఏలూరు రూరల్ మండలం కలకుర్రు గ్రామస్తులకు అధికారులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలితో పాటు ఎంపీడీఓ బి.ప్రణవి తదితరులు గ్రామానికి చేరి ముంపు పరిస్థితిని పరిశీలించారు. వరద ముంపు తగ్గేవరకు జాగ్రత్తగా ఉండాలని ఆర్డీఓ ప్రజలకు సూచించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ, సహకారం అందిస్తుందని తెలిపారు.

## వరద బాధితులకు యూటీఎఫ్ సహకారం





దుస్తులు, ఆహార పదార్థాలు సిద్ధం చేసిన యూటీఎఫ్ నాయకులు

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** విజయవాడలో బుడమేరు వరదల్లో ఇబ్బంది పడుతున్న ప్రజలకు, ఏలూరు జిల్లాలో అనేక మండలాల్లో ముంపుకు గురై ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి యూటీఎఫ్ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సహకారం అందించినట్లు ఆ సంఘం ప్రతినిధులు తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర సంఘం సూచనల మేరకు ఉపాధ్యాయులు వివిధ మండలాల నుంచి ఆర్థిక సహకారం, వస్తువుల రూపంలో సహకారం అందించడానికి ముందుకొచ్చినట్లు చెప్పారు. ఇందులో భాగంగా తొలుత సోమవారం వసంతవాడలో పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న పెదపాడు మండలం గోగుంట గ్రామస్తులకు దుస్తులు, దుప్పట్లు మొదలైనవి పంపిణీ చేశామన్నారు. ఆహార పదార్థాలు, బిస్కెట్లు ప్రజలకు అందజేశామని తెలిపారు.


## వైభవంగా గణపతి నవరాత్రి మహోత్సవాలు



ఏలూరు తంగెళ్లమూడి వంతెన వద్ద..




12 పంపుల సెంటర్‌లో వినాయకుడు



గాంధీ నగర్‌లో నెమలి పింఛాలతో వినాయకుడు



విజయవిహార్ సెంటర్‌లో మహిళల కోలాటం



రామకోటిలో భారీ వినాయక విగ్రహం



గాంధీ మండపం వద్ద వినాయక విగ్రహం

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** నగరంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో వివిధ ఆకృతుల్లో ఏర్పాటు చేసిన భారీ గణనాథులకు ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఉదయం, రాత్రి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రెండు పూటలా స్వామి వారికి అర్చకులు కుంకుమ పూజలు చేసి, హోమాలు నిర్వహిస్తున్నారు. స్వామి వార్లకు ప్రత్యేక అలంకరణలు చేస్తున్నారు. సోమవారం నవరాత్రి మహోత్సవాల మూడో రోజు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల నిమజ్జన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ట్రాక్టర్లపై గణనాథులను నగర వీధుల్లో భారీ ఊరేగింపుతో నగరంలోని పోస్టల్ కాలనీ, వసంతమహల్ సెంటర్, పాత బస్టాండు, తూర్పు లాకులు, పడమర లాకులు, ఆశ్రం కళాశాల ప్రాంతాల్లోని నిమజ్జన ప్రాంతాలకు తరలించారు. యువకులు ఊరేగింపులో మేళతాళాలు, డీజేలు, తీన్‌మార్‌లకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ బాణసంచా కాల్చుతూ ఉత్సాహంగా ముందుకు కదిలారు. నిమజ్జనం సమయంలో గణపతిబొప్పా మోరియా అనే నినాదాలు మిన్నంటాయి.

## వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు

**ఏలూరు (టూటౌన్):** ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు కమిషనర్ ఎ.భాను ప్రతాప్ తెలిపారు. నిర్వాహకులు నిమజ్జన కార్యక్రమాల్లో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సోమవారం మూడవ రోజు కావడంతో నిమజ్జన కార్యక్రమాలు మొదలవుతాయని దానికి అనుగుణంగా ముందుగానే ఏర్పాట్లు చేశామన్నారు. కృష్ణ కాలువ వెంబడి, తూర్పులాకుల వద్ద, మినీ బైపాస్‌రోడ్డులో గ్రీన్‌సిటీ వద్ద రెండుప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామన్నారు. కాల్వలోకి దిగే మెట్లు మార్గం శుభ్రం చేయించి లైటింగ్, క్రేన్ కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. కృష్ణకాలువ నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున భక్తులెవరు కాలువలోకి దిగవద్దని హెచ్చరించారు. క్రేన్ సహాయంతో నిమయజ్జనం చేయాలన్నారు.

### అశ్లీల నృత్యాలు, డీజేలకు అనుమతుల్లేవ్

**ఏలూరు టౌన్:** ఏలూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి అశ్లీల నృత్యాలు, డీజేలతో ఊరేగింపులు నిర్వహించేందుకు పోలీస్ అనుమతులు లేవని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఇష్టారాజ్యంగా ఏలూరు నగరం, ఇతర పట్టణాలు, గ్రామాల్లో భారీ శబ్దాలతో డీజేలతో ఊరేగింపులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏలూరు నగరంలో వినాయక ఉత్సవ కమిటీలు నిమజ్జనానికి ముందుగానే పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. నిమజ్జనం కార్యక్రమంలో యువత జాగ్రత్తలు పాటిస్తూ వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

### ఏలూరు మహిళా స్టేషన్ సీఐగా సుబ్బారావు

**ఏలూరు టౌన్:** ఏలూరు మహిళా స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం సుబ్బారావు నియమితులయ్యారు. ఆయన సోమవారం రాత్రి మహిళా స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన ఏలూరు జిల్లా డీసీఆర్‌బీలో సీఐగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా మహిళా స్టేషన్ సీఐగా వచ్చారు. 1996 బ్యాచ్ ఎస్సైగా పోలీస్ శాఖలో చేరిన ఆయన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా మొగల్తూరు, చాగల్లు, ఏలూరు త్రీటౌన్ తదితర పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. అనంతరం ఆయన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఏలూరు జిల్లా ఎస్‌బీ సీఐగా, భీమడోలు, ఇటీవల డీసీఆర్‌బీ సీఐగానూ సమర్థవంతంగా పనిచేశారు.

### అప్రమత్తంగా ఉండాలి

**ఏలూరు (టూటౌన్):** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా ఏలూరు నగర ప్రజలు ఇళ్లల్లో చెత్త రోడ్డు మీద వేయకుండా ఉండాలని, ప్రతి రోజు తినే ఆహారంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ ఎ.భాను ప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు సూచించారు. తమ్మిలేరు వెంబడి నివశించే వారు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వరుసగా 8వ రోజు కూడా విజయవాడ వరద బాధితులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనాన్ని నగరపాలక సంస్థ తరుపున పంపించామన్నారు. తరలించే టిఫిన్, భోజన సరఫరా వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. పలువురు కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సైన్స్‌పై ఉత్తేజ పరచిన బ్రహ్మాజీరావు

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** జిల్లాలో సైన్స్‌పై విద్యార్థులకు, యువతకు అవగాహన కలిగించి, వారిని ఉత్తేజ పరచడంలో స్థానిక ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాల అధ్యాపకునిగా పట్నాల వెంకట బ్రహ్మాజీరావు చేసిన కృషి అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంలోని ఎస్‌పీడీబీటీ జూనియర్ కాలేజీలో కెమిస్ట్రీ అధ్యాపకులుగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన పట్నాల వెంకట బ్రహ్మాజీరావు ఆకస్మిక మృతి సందర్భంలో ఆయన కుటుంబ సభ్యులు సోమవారం స్థానిక కల్యా హైట్స్ ఫంక్షన్ హాల్‌లో సంతాప సభ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ సాంకేతిక దృక్పథంతో ఆయన అనేక కార్యక్రమాలు చేపట్టారని, వివిధ సంఘాలకు సేవ చేశారని, ఆల్ ఇండియా రేడియోలో ప్రసంగిస్తూ సైన్స్ పట్ల యువతను ఉత్తేజ పరిచారని, జన విజ్ఞాన వేదిక ద్వారా పలు కార్యక్రమాలలో సేవలు అందించారని గుర్తుచేశారు. జిల్లాలో సైన్స్ సెంటర్, బాలయోగి సైన్స్ సెంటర్ ఏర్పాటుకు, అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. అమెచ్యూర్ రేడియో (హామ్ రేడియో) అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. బ్రహ్మాజీరావు కుమారులు మాట్లాడుతూ తమ తండ్రి ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. రిటైర్డ్ కాలేజీ టీచర్స్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎల్ వెంకటేశ్వర రావు, జర్నలిస్ట్ ఎస్.సురేంద్ర, కాలేజీ ప్రిన్సిపాల్ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి రత్నప్రసాద్

**ఏలూరు (టూటౌన్):** బాలికల వసతి గృహంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. స్థానిక అమీనాపేటలోని బాలికల వసతి గృహాన్ని సోమవారం ఆయన సందర్శించారు. బాలికలకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. వసతి గృహంలో మురుగు నీరు అస్తవ్యస్తంగా ఉందని ఇదే పరిస్థితి కొనసాగితే విద్యార్థులకు విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని రత్నప్రసాద్ హెచ్చరించారు. బాలికలు చదువుతో పాటు బాలికల సంరక్షణ చట్టాల గురించి అవగాహన పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు ఎం గంగాభవాని, కె.సునీత, వసతి గృహం సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 35 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 44 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్) | 22.30 | 26 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 36 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 27 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ | 21.15 | 4822 | 29 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 30 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 22 |
| ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 30 |
| ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 20.30 | 4800 | 28 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 29 |
| ఏలూరు - ఈసీఐఎల్ | 22.30 | 4814 | 29 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 31 |

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 32 | అరటి కాయ (1) | 07-10 |
| వంకాయలు (గులాబీ) | 64 | చిక్కుడు కాయలు | 60 |
| వంకాయలు (కాంతులు) | 64 | చామదుంపలు | 44 |
| వంకాయలు (తెలుపు) | 54 | ములక్కాదలు | 7,10 |
| బెండకాయలు | 50 | కంద | 50 |
| పచ్చిమిర్చి | 30 | బీట్‌రూట్ | 36 |
| కాకర కాయలు | 45 | కీరా దోస | 44 |
| బీరకాయలు | 40 | ఫ్రెంచ్‌బీన్స్ | 94 |
| బీరకాయలు (పందిరి) | 54 | అల్లం | 80-160 |
| క్యాబేజీ | 30 | కొత్తిమీర (కట్ట) | 45 |
| క్యారెట్ | 40 | పాలకూర | 12 |
| దొండకాయలు | 55 | చుక్కకూర | 12 |
| బంగాళదుంపలు | 40 | తోటకూర | 12 |
| ఉల్లిపాయలు | 58 | గోంగూర | 07 |
| గోరుచిక్కుడు | 54 | పుదీనా | 05 |
| దోసకాయలు | 28 | బఠాణి | -- |
| ఆనపకాయ (1) | 25-30 | క్యాప్సికమ్ | 80 |
| పొట్లకాయ(1) | 20 | చిలకడదుంప | 52 |